


# అక్షర దర్బార్

వెల ₹5

www.aksharadarbar.com

voice of the people

మంగళవారం 11, మార్చి 2025 | సంపుటి :02 | సంచిక :29 | పేజీలు :05


కిషన్ రావు పల్లి టు భూపాలపల్లి రోడ్డుకు

## రూ.33 కోట్లు



- రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

04

## నర్సంపేటలో ఉద్రిక్తత

- భూ వివాదంలో బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ పార్టీ నాయకుల రాళ్ల దాడులు
- పోలీసులకు గాయాలు
- నాలుగు కోట్ల భూమికి 400 మంది పరస్పర రాళ్ల దాడి

03

## పరామర్శకు వెళ్లి.. లిఫ్ట్‌లో పడి..



- ప్రమాదవశాత్తు 17వ బెటాలియన్ కమాండెంట్ మృతి
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో దారుణం

03



## ములుగు జిల్లాలో గవర్నర్ పర్యటన

- దత్తత గ్రామం కొండపర్తిలో అభివృద్ధి పనులు..
- ఘన స్వాగతం పలికిన మంత్రి సీతక్క.

06



# ఎకరానికి రూ. 1 లక్ష

- 24 ఎకరాలకు రూ. 24 లక్షలు డిమాండ్
- అడిగిన మొత్తం ఇవ్వకపోవడంతో హోల్డ్‌లో ఫైల్
- అంతేగాక నకిలీ పత్రాలతో మొత్తం భూమికి ఎసరు
- ముగ్గురి పేర అక్రమ రిజిస్ట్రేషన్‌కు పన్నాగం
- పథకం బెడిసికొట్టడంతో నిలిచిపోయిన ప్రక్రియ
- హన్మకొండ జిల్లాలో ఓ తహసీల్దార్ బరితెగింపు
- ఉన్నతాధికారులకు బాధితుడి ఫిర్యాదు
- రెండున్నర ఏండ్లుగా న్యాయ పోరాటం
- ఆత్మకూరు మండలంలోని ఓ గ్రామంలో ఘటన
- ఈ మొత్తం వ్యవహారంలో అసలు సూత్రధారి ప్రముఖ డాక్టర్
- మరిన్ని వివరాలు రేపటి సంచికలో..

తండ్రి చనిపోవడంతో ఆయన పేర ఉన్న భూమి హక్కులు బదలాయించాలని దరఖాస్తు పెట్టుకున్న వారసుడికి చుక్కలు చూపించాడు ఓ తహసీల్దార్. 24 ఎకరాల పైచిలుకు వారసత్వ ఆస్తి మార్పిడి కోసం ఎకరానికి రూ. 1 లక్ష చొప్పున మొత్తం 24 లక్షలు డిమాండ్ చేశాడు. పైసలిస్తేనే పని అవుతుందని తేల్చిచెప్పాడు. బిత్తరపోయిన బాధితుడు అంత డబ్బు ఇవ్వలేకపోవడంతో అధికారి కనికరించకుండా ఫైల్‌ని హోల్డ్‌లో పెట్టాడు. అక్కడితో ఆగకుండా దుర్బుద్ధితో తన అధికారం ఉపయోగించి, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి 24 ఎకరాల భూమికి ఎసరు పెట్టాడు. వారసుడికి తెలియకుండానే తన తండ్రి పేర ఉన్న భూమిని ముగ్గురి పేర అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు స్కెచ్ వేశాడు. ఈ విషయం బాధితుడి తెలిసి తహసీల్దార్‌ను నిలదీయడంతో ప్రక్రియ నిలిచిపోయింది. కాగా.. 24 ఎకరాలను అప్పనంగా కొల్లగొట్టే పథకానికి ఓ ప్రముఖ డాక్టర్ వ్యూహరచన చేయగా, తహసీల్దార్ అమలు చేసేందుకు యత్నించి విఫలమయ్యాడు. బాధితుడు అప్పటి వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. అయితే.. ఏండ్లు గడుస్తున్నా ఎలాంటి చర్యలు లేకపోవడంతో ఇంకా కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు.

—అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి

06



## నేను లోకల్...!!

- స్థానిక ఇసుక లారీ ఓనర్ల పేరిట జులుం
- సీరియల్ పాటించకుండా బెదిరిస్తున్న వైనం
- తిండి తిప్పలు, నిద్ర లేక ఇబ్బందులు పడుతున్న నాన్ లోకల్ డ్రైవర్లు
- పట్టించుకోవాలంటూ వేడుకలు

05



## త్రివేణి సంగమంలో ఇసుక దందా..!

- గోదావరి తీరంలో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు
- పుష్కరాలు సమీపిస్తున్న తరుణంలో భారీగా గుంతలు
- అడుగంటి పోనున్న గోదావరి భూ గర్భ జలాలు

04

మంగళవారం
11.03.2025
www.aksharadarbar.com
అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

# కాంగ్రెస్‌ను చీల్చి చెండాడండి

- ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి
- అసెంబ్లీలో, మండలిలో సభ్యులు పోరాడాలి
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు కేసీఆర్ దిశానిర్దేశం
- తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ ఎల్పీ సమావేశం



అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన బీఆర్ఎస్ఎల్పీ సమావేశం మంగళవారం జరిగింది. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా పలు అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పార్టీ శాసన సభ, మండలి సభ్యులందరూ నిర్ణీత సమయానికి సభకు హాజరుకావాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై, ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై చీల్చి చెండాడాలన్నారు. బీఆర్ఎస్‌పై ప్రభుత్వం చేస్తున్న తప్పుడు నిందలను తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్రంలో నెలకొన్న పలు సమస్యలు, ఎండిన పంటలు, అందని కరెంటు, అందని సాగునీరు, కాలిపోతున్న మోటర్లు తదితర రైతాంగ సమస్యలపై, మంచినీటి కొరతపై అసెంబ్లీలో, మండలిలో పోరాడాలని సూచించారు.

**మూడు గంటలకుపైగా భేటీ..**

బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతుగా గొంతు వినిపించాలని.. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు నిర్వీర్యమవుతున్న తీరుపై మాట్లాడాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్, డీఏల పెండింగ్, పీఆర్సీ అమలుపై అసెంబ్లీ మండలి వేదికగా ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చేందుకు కొట్లాడాలన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన దాదాపు మూడు గంటల పాటు ఎల్పీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ప్రజల పక్షాన గట్టిగా పోరాడాలని సమావేశం నిర్ణయించింది. సభలో ఇంకా ప్రతిభావంతంగా ప్రజాసమస్యలపై పోరాడేందుకు సభ్యులను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకునేందుకు డిప్యూటీ లీడర్లను నియమించనున్నట్లు కేసీఆర్ తెలిపారు. ఎల్పీ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనసభ సభ్యులు, మండలి సభ్యులు పాల్గొన్నారు.

# డెడ్ లైన్ 14

- అభివృద్ధి పనులను వేగవంతం చేసి సీఎం పర్యటన సక్సెస్ చేయాలి
- అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి
- స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా



అక్షరదర్బార్, జనగామ: ఈ నెల 16న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్టేషన్ ఘనపూర్ పర్యటన నేపథ్యంలో తగిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్, (రెవెన్యూ) రోహిత్ సింగ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ లతో కలిసి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆర్డీఓ, జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, తహసీల్దార్లు, సంబంధిత అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. ఈ నెల 14వ తేదీ వరకు సంబంధిత పనులన్నింటినీ వేగవంతం చేసి పూర్తిచేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో చేపట్టాల్సిన ఆయా పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్డీఓ వెంకన్న, ఘనపూర్ మున్సిపల్ కమిషనర్ రవీందర్, ఏసీపీ భీంశర్మ, పీడీ డీఆర్డీఓ వసంత, డీఏంహెచ్ఓ మల్లి కార్జునరావు, డీపీఓ స్వరూప, హౌసింగ్ పీడీ మాత్రు నాయక్, విద్యుత్ ఎస్ఈ వేణుమాధవ్ పాల్గొన్నారు.

## శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసులు విఫలం

**నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి**



అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట నియోజకవర్గంలో శాంతి భద్రతలను కాపాడడంలో పోలీసులు విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. గత 15 నెలలుగా అధికార పార్టీ నాయకులు చేస్తున్న అరాచకాలు, కబ్జాలు దాడులపైన అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోపోవడంతో శోచనీయమని ఆయన వాపోయారు. మంగళవారం నర్సంపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుల అరాచకాలకు అండగా స్థానిక సీఐ నిలుస్తున్నారని, నర్సంపేటలో పోలీసుల తీరుపై గతంలో సీపీకి లేఖలు రాసినా, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి మార్పులేదని అన్నారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా వ్యవహరించడంతో కాంగ్రెస్ నాయకుల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని మండిపడ్డారు. పదేళ్లుగా అభివృద్ధి, సంక్షేమం, శాంతికి నిలయంగా ఉన్న నర్సంపేట నేడు అశాంతి, అల్లర్లు అరాచకం వైపు నడవడం దురదృష్టకరమని వాపోయారు. పోలీస్, ఉన్నతాధికారులు ఇప్పటికైనా నర్సంపేటలో కాంగ్రెస్ నాయకుల అరాచకాలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## 23న ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అక్షర దర్బార్, పరకాల : విద్యారంగా సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్న భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) పూర్వ విద్యార్థుల సమ్మేళనం మార్చి 23న హనుమకొండ కాళోజీ కళాక్షేత్రంలో జరుగుతుందని, జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ పూర్వ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం పరకాల పట్టణంలో ఎస్ఎఫ్ఐ పూర్వ విద్యార్థుల సన్నాహక సమావేశం మాజీ ఎస్ఎఫ్ఐ పరకాల డివిజన్ బాధ్యులు సీనియర్ జర్నలిస్ట్ దామెర రాజేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాగుల రమేష్ మాట్లాడుతూ 1970 నుండి 2016 వరకు వరంగల్ ఉమ్మడి జిల్లాలో పనిచేసిన ఎస్ఎఫ్ఐ పూర్వ నాయకులను సమీకరించి మహా సమ్మేళనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వరంగల్ ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి లు జి.గంగాధర్, డి. తిరుపతి, పరకాల డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి బొట్ల నరేష్, అంకేశ్వరపు ఐలయ్య,వరంగల్ ఏఎంసి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల రుద్ర ప్రసాద్, నక్క చిరంజీవి, మైస సురేందర్, కోగిల చంద్రమౌళి, తుడుం క్రాంతి, బొల్లారం సంపత్, జి, కరుణాకర్, దొగ్గెల.కుమార్,ఏ. ప్రశాంత్ వైద్య, నాగుల కుమార్, యం. రవి, ప్రభాకర్ పాల్గొన్నారు.

## తప్పిపోయిన యువతిని అప్పగింత



అక్షర దర్బార్, పరకాల : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన చొల్లేటి వెన్నెల మతిస్థిమితం లేక తప్పిపోయినట్లు సోదరుడు చొల్లేటి శివ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి సీసీ ఫుటేజీ ఆధారంగా బాధితురాలిని ఆచూకీ తెలుసుకుని ఆమెను చేరదీసి పరకాల ఎస్సై సబ్బాని శివకృష్ణ ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.



## బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే మురళి నాయక్ పరామర్శ

అక్షర దర్బార్,తొర్రూరు : మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని మేచరాజుపల్లి గ్రామానికి చెందిన సోమారపు ప్రవీణ్ తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రయాణిస్తున్న కారు ఇటీవల ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో తండ్రితో పాటు కుమారుడు, కూతురు మృతి చెందారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీ నాయక్ మంగళవారం వారి స్వగృహానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ జిల్లా నాయకులు, మండల నాయకులు, డైరెక్టర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న పెద్దారపు రమేష్

## అసైన్డ్ భూముల్లో రియల్ వ్యాపారాన్ని అరికట్టాలి

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్

అక్షర దర్బార్, నర్సంపేట : ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో భూదందాలకు పాల్పడుతూ నిబంధనలను అతిక్రమిస్తూ శాంతిభద్రతల సమస్య సృష్టిస్తున్న వ్యక్తులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ డిమాండ్ చేశారు.. మంగళవారం ఎంసీపీఐ(యూ) నర్సంపేట డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో నర్సంపేటలో అత్యంత విలువైన ప్రభుత్వ అసైన్డ్ భూములను భూ కబ్జాదారుల నుంచి కాపాడాలని పేదల స్వాధీనంలో ఉన్న ప్రభుత్వ భూములను క్రమబద్ధీకరించాలని కోరుతూ స్థానిక ఆర్డీఓ కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించి ఆర్డీవో ఉమాదేవికి మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా పెద్దారపు రమేష్ మాట్లాడుతూ నర్సంపేట పట్టణం జనాభాపరంగా పెరిగి మునిసిపాలిటీ గా అవతరించిందని కానీ పేదలకు నివసించడానికి నిలువ నీడ లేక వేలాది కుటుంబాలు కిరాయి చెల్లిస్తూ జీవిస్తున్నారని వాపోయారు. సర్వే నెంబర్ 111, 702, 813, 204లో ఆక్రమణకు గురైన అసైన్డ్ భూముల రక్షణకు ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోకపోతే ఎర్రజెండా ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ సహాయ కార్యదర్శి కొత్తకొండ రాజమౌళి ఏఐసిటియు జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ మాషూక్ స్థానిక నాయకులు గజవెల్లి జగపతి నకినబోయిన మహేష్ అశోక్ మాలమ్మ జమున కృష్ణ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



# పరామర్శకు వెళ్లి.. లిఫ్ట్‌లో పడి..

- ప్రమాదవశాత్తు 17వ బెటాలియన్ కమాండెంట్ మృతి
- రాజన్న సిరిసిల్ల జిల్లాలో దారుణం

అక్షరదర్బార్, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో దారుణం జరిగింది. ప్రమాదవశాత్తు లిఫ్ట్‌లో పడి 17వ బెటాలియన్ కమాండెంట్ తోట గంగారాం (58) మృతి చెందాడు. ఇటీవల సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబీకులు మరణించగా కమాండెంట్ గంగారం నిన్న రాత్రి వారిని పరామర్శించేందుకు వెళ్లారు. అపార్ట్‌మెంట్లో లిఫ్ట్ రాకముందే గేటు తీసి ముందుకు వెళ్లడంతో మూడో ఫ్లోర్ నుంచి మొదటి ఫ్లోర్‌లో గల లిఫ్టుపై పడిపోయాడు. తీవ్ర గాయాలుకాగా వెంటనే ఫైర్ సిబ్బంది బయటకు తీసి ఆసుపత్రికి తరలించారు. అప్పటికే గంగారం మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సిద్దులం గ్రామానికి చెందిన గంగారాం సిరిసిల్ల 17వ బెటాలియన్ కమాండెంట్‌గా మూడు నెలల కిందటే విధుల్లో చేరారు. గతంలో రాష్ట్ర సచివాలయం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా కూడా పనిచేశారు.



# ఏసీబీ వలలో ఎక్సైజ్ ఉద్యోగి

- రూ.1500 లంచం తీసుకుంటూ పట్టుబడిన సీనియర్ అసిస్టెంట్ సోమ్లా..

అక్షరదర్బార్, ఖమ్మం: ఏసీబీ వలలో ఎక్సైజ్ ఉద్యోగి చిక్కాడు. రూ.1500 లంచం తీసుకుంటూ ఖమ్మం ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ భూక్యా సోమ్లా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. బార్ అండ్ రెస్టారెంట్ లైసెన్స్ జిరాక్స్ కాపీ ఇచ్చేందుకు రూ.1500 లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించాడు. ఇవాళ లంచం తీసుకుంటుండగా భూక్యా సోమ్లాను అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమేష్ తెలిపారు.

# ప్రజాప్రభుత్వంలో విద్యాభివృద్ధికి పెద్దపీట

- భూపాలపల్లిలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరు
- నిధులు మంజూరు చేసిన సీఎంకు ధన్యవాదాలు : ఎమ్మెల్యే జీఎస్సార్
- 43 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ
- ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర



మహిళా శక్తి క్యాంటిన్ ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

అక్షర దర్బార్, జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : తెలంగాణలో విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ, నిరుపేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందించడమే సీఎం రేవంత్ రెడ్డి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ గురుకుల స్కూళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భూపాలపల్లిలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ భవనానికి రూ.200 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. అనంతరం రూ.43,04,988 విలువైన కళ్యాణలక్ష్మీ చెక్కులను 43 మంది లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, పీసీసీ సభ్యులు దబ్బేట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు..

## చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రేవూరి



సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

అక్షర దర్బార్, పరకాల : పార్టీలకు అతీతంగా లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. మంగళవారం పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల పట్టణ, మండలం, నడికూడ, ఆత్మకూర్, దామెర మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం తరఫున బాధ్యతగా నేరుగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం ద్వారా ఆర్థిక సాయం అందజేస్తున్నామని తెలిపారు. పరకాల నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు రూ.200 కోట్ల నిధులు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కలకు ధన్యావాదాలు తెలిపారు.

# పల్లెల్లో జాజిరి సందడి

## సాయంత్రం వేళ చిన్నారుల అట, పాట



అక్షర దర్బార్,తొర్రూరు : గ్రామాల్లో పిల్లలంతా సంతోషంగా ఆడుకునే జాజిరి ఆటలు ప్రారంభమయ్యాయి. హోలీ పండుగకు ముందు పది రోజుల పాటు గ్రామాల్లో జాజిరి ఆట ఆడుకుంటారు. పిల్లలంతా సాయంత్రం వేళ అన్ని ఇళ్లు తిరుగుతూ వారు ఇచ్చే ధాన్యం, డబ్బులు తీసుకుంటారు. పది రోజుల పాటు ఆడిన తర్వాత చివరి రోజు కోలలను ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసే కామదహనంలో వేసి దహనం చేస్తారు. అనంతరం పది రోజుల పాటు జాజిరి అడుకోగా వచ్చిన ధాన్యం, బియ్యం, డబ్బులను సమానంగా పంచుకుంటారు.



# నర్సంపేటలో భూవివాదం

- రెండు వర్గాల రాళ్ల దాడులు
- పలువురికి గాయాలు
- రంగంలోకి దిగిన పోలీసులు
- లాఠీచార్జ్‌తో పరిస్థితి అదుపులోకి..

అక్షర దర్బార్, నర్సంపేట : అసైన్డ్ భూ వివాదంలో వరంగల్ జిల్లా నర్సంపేట రణరంగంగా మారింది. వివరాల్లోకి వెళితే నర్సంపేట పట్టణంలోని మాదన్నపేట రోడ్డులోని సర్వేనెంబర్ 111లోని అసైన్ భూ వివాదంలో కాంగ్రెస్ పార్టీ, బీఆర్ఎస్ నాయకుల మధ్య పరస్పరం రాళ్ల దాడులు చోటు చేసుకుంది. దాడులను నిలువరించబోయిన నర్సంపేట టౌన్ సీఐ రమణమూర్తి, ఎస్సై రవికుమార్ గాయాలపాలయ్యారు. తీవ్రంగా గాయపడిన నర్సంపేట ఎస్సై రవికుమార్ ను ఆస్పత్రికి తరలించారు. దీంతో నర్సంపేట పట్టణంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది.

## అసలు ఏం జరిగింది?

నర్సంపేట పట్టణంలోని మాధన్నపేట్ రోడ్డులో రామ అనసూయ దేవికి చెందిన భూమి సర్వేనెంబర్ 111/1/91, 11/1/92 లో ఆరెకరాల భూమిని నర్సంపేటకు చెందిన ఓడీఎంఎస్ చైర్మన్ రామస్వామి నాయక్ ఎకరాకు రూ.50 లక్షల చొప్పున 2019లో కొనుగోలు ఒప్పందం చేసుకున్నాడు. ఈ క్రమంలో కిస్తీల ప్రకారం కొంత మొత్తం చెల్లించి మిగతావి రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లిస్తానని చెప్పి రిజిస్ట్రేషన్ కి వెళ్తే అట్టి భూమి ప్రోహిబిటెడ్ లిస్టులో ఉందని రిజిస్ట్రేషన్ కాదని రిజిస్ట్రేషన్ అధికారులు తెలిపారు. రిజిస్ట్రేషన్ అయితలేదని దీంతో మిగతా డబ్బులు చెల్లించలేదు. ఈ క్రమంలో భూ యజమానురాలు మరణించడంతో ఆమె వారసులైన రిటైర్డ్ జవాన్ రామచంద్ర మోహన్ అతని కుటుంబ సభ్యులు కలిసి రామస్వామి నాయక్ డబ్బులు చెల్లించక తమను ఇబ్బంది పెడుతున్నాడని స్థానిక ఎమ్మెల్యే దృష్టి తీసుకెళ్లగా భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ పత్రాలు, భూ హక్కు పత్రాలు అన్నీ కూడా పరిశీలించి న్యాయం చేయాలని డివిజన్ రెవెన్యూ అధికారులను ఆదేశించాడు . దీంతో సంబంధిత భూమి పత్రాలను రెవెన్యూ అధికారులు పరిశీలించి రామస్వామి నాయక్ ని మందలించి నిషేధిత జాబితాలో ఉన్నటువంటి భూమి ఎలా కొనుగోలు చేస్తావని హెచ్చరించారు. ఇట్టి భూమి రిజిస్ట్రేషన్ చేయించుకోవడం అసాధ్యమని తెలిపారు. ఈ క్రమంలో ఇదే భూమిని పట్టణానికి చెందిన పెండెం రామానంద్ తో పాటు పలువురు కలిసి భూ యజమాని వారసులతో ఒప్పందం చేసుకొని పూర్తి డబ్బులు చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ క్రమంలో రామస్వామి నాయ క్ మంగళవారం కొంతమంది తండావాసులతో కలిసి రామానంద్ వర్గంపై దాడికి దిగాడు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం పెరిగి పరస్పరం దాడులకు దిగారు. సమాచారం అందుకున్న వరంగల్ తూర్పు డీసీపీ అంకిత్ కుమార్ నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్ నేతృత్వంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరు వర్గాలపై లాఠీచార్జ్ చేసి చెదరగొట్టారు. భూ హక్కు పత్రాలతో కోర్టుకెళ్లి తమ సమస్యను పరిష్కరించుకోవాలని, ఇలా ప్రత్యక్ష దాడులకు దిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని డీసీపీ అంకిత్ కుమార్ ఆందోళనకారులను హెచ్చరించారు.

మంగళవారం
11.03.2025
www.aksharadarbar.com

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక



# డే అండ్ నైట్ ఇసుక దందా!

- గోదావరి తీరంలో అడ్డగోలుగా తవ్వకాలు
- పుష్కరాలు సమీపిస్తున్న తరుణంలో భారీగా గుంతలు
- అడగంటి పోనున్న భూ గర్భ జలాలు
- పట్టించుకోని అధికారులు

అక్షర దర్బార్, కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమ గోదావరి తీరంలో ఇసుక దొంగలు రాజ్యమేలుతున్నారు. డే అండ్ నైట్ అనే తేడా లేకుండా కొందరు అక్రమార్కులు ఇసుకను అడ్డగోలుగా తోడేస్తున్నారు. ట్రాక్టర్ల ద్వార ఇసుకను అడ్డదారిలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేంటని ప్రశ్నంచే వారే లేకపోవడంతో నిలువునా పవిత్రమైన గోదావరి తీరాన్ని తవ్వేస్తూ మాకెవ్వరు అడ్డంటూ బహిరంగ ఛాలెంజ్ విసురుతున్నారు.వందల సంఖ్య లో ట్రిప్పుల మీద ట్రిప్పులు ఇసుకను తరలిస్తూ గోదావరి తీరాన్ని గుల్ల చేస్తుండగా పట్టించుకోవాల్సిన అధికారులు మౌనం వహిస్తున్న తీరు విమర్శలకు తావిస్తుంది. దుబ్బగూడెం కాలనీ మీదుగా అధిక వేగంతో ట్రాక్టర్లు నడుపుతూ రాత్రి వేళల్లో కాలనీవాసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టి ట్రాక్టర్లను సీజ్ చేయాలని స్తానికులు డిమాండ్ చేస్తున్నారు.

- మే నెలలో పుష్కరాలు.. యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు..

పన్నెండేళ్లకు ఒక్కసారి వచ్చే సరస్వతి పుష్కరాలు మే నెల 15వ తేదీ నుండీ 26 వరకు జరగనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం వైభవంగా పుష్కరాలు నిర్వహించాలని భావిస్తుండగా రాష్ట్ర నల మూలల నుండీ భక్తులు భారీ సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. అంతటి ప్రాచుర్యం కల్గిన సరస్వతి పుష్కరాలు సమీపిస్తుండగా మరో వైపు అదే గోదావరి తీరంలో ఇసుక తవ్వకాలు జోరుగా జరుగుతున్న తీరు అందరినీ విస్మయంలో ముంచేస్తుంది. ఇలా రాత్రింబవళ్లు అడ్డూ అదుపు లేకుండా ఇసుక తవ్వకాలు జరుగుతుండగా భారీ మొత్తంలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడుతున్నాయి. దీంతో పుష్కరాలకు వచ్చే భక్తులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. అదేవిధంగా గోదావరిలో భూగర్భ జలాలు అడుగంటి పోయి సమీప వ్యవసాయ పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అధికారుల మౌనమేల..?

కాళేశ్వర గోదావరి తీరంలో గత కొన్ని రోజులుగా నడుస్తున్న అక్రమ ఇసుక రవాణాపై అధికారులు మౌనం వహించడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర గోదావరి తీరానికి సంబంధించి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాల్సింది ఉండగా అవేం వారికి పట్టనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అక్రమ ఇసుక తవ్వకాలపై తెలంగాణ ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుండగా మహదేవపూర్ మండలంలో సంబంధిత అధికారులు మౌనంగా ఉంటున్న వ్యవహారం చర్చనీయాంశమనే చెప్పుకోవచ్చు. ఇప్పటికైనా సంబంధిత మైనింగ్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ అక్రమ ఇసుక రవాణాను కట్టడి చేయవలసిందిగా స్థానికులు కోరుతున్నారు.



# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

- పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపికచేయాలి
- వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూడాలి
- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- అధికారులకు దిశానిర్దేశం

అక్షరదర్బార్, హనుమకొండ : బడ్జెట్ చివరి మాసం, కొత్త బడ్జెట్ ప్రవేశపెట్టే క్రమంలో నియోజవర్గ పరిధిలో పెండింగ్లో ఉన్న అభివృద్ధి పనులను ప్రారంభించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. మంగళవారం కుడా కార్యాలయంలో నిర్వహించిన వరంగల్ పశ్చిమ నియోజవర్గ సమీక్ష సమావేశంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, కమిషన్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి సమీక్షించారు. నగరంలో పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన ప్రారంభించాలని, స్మార్ట్ సిటి నిధుల ద్వారా జరుగుతున్న పనుల పురోగతిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే నాయిని సూచించారు. రోడ్డు విస్తరణ, భద్రకాళి, అభివృద్ధిలో ఇళ్లు కోల్పోతున్న వారికి రెండు పడకల ఇళ్లు ఇచ్చేలా చూడాలని కోరారు. నిజమైన అర్హులను గుర్తించాలని అధికారులను ఆదేశించారు. భద్రకాళి బండ్ పనులు 75 శాతం పూర్తయ్యాయని అధికారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

### యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

వేసవికాలం సమీపించిన సమయంలో నగరంలోని ప్రజలకు ఎటువంటి నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే నాయిని ఆదేశాలు జారీ చేశారు. మూతబడిన బోర్లను వెంటనే మరమత్తులు చేయాలని, అవసరం ఉన్న ప్రాంతాల్లో కొత్త బోర్లకు అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. వేసవితాపం తీర్చేందుకు మూడు నెలలు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలకు నియోజవర్గంలో ఉన్న 24 ప్రధాన పార్కులను మరమత్తులు చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి వరంగల్ నగర అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ప్రజాపాలన సాగించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో కుడా, కార్పొరేషన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధం

- సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం
- కట్టుబట్టలతో రోడ్డున పడ్డ బాధితులు
- ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి



కాలిపోయిన సామగ్రి

అక్షర దర్బార్, మల్హర్ : షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైన ఘటన తాడిచెర్ల మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఇందారపు శోభారాణి-కుమార్ కు చెందిన పెంకుటిల్లు మంగళవారం మధ్యాహ్నం సమయంలో షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వారు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి ఏఎమ్మార్ అగ్నిమాపక యంత్రాంగం వచ్చేసరికి జరగాల్సిన నష్టం జరిగినట్లుగా బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరయ్యారు. అగ్ని ప్రమాదంలో 2 తులాల బంగారం, 40 తులాల వెండి, రూ.20 వేలు నగదు, కూలర్, టీవి రెండు బీరువాలు, నిత్యావసర సరుకులు కాలి బూడిదైనట్లు బాధితులు వాపోయారు. ప్రమాదంలో సుమారు రూ.10 లక్షల నష్టం జరిగినట్లుగా తెలిపారు. కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. కాగా, ఘటనా స్థలాన్ని తహసీల్దార్ రవికుమార్ సందర్శించారు. ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

# కిషన్ రావుపల్లి టు భూపాలపల్లి

- రూ.33 కోట్లు మంజూరు
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- కృతజ్ఞతలు తెలిపిన మండలవాసులు



అక్షర దర్బార్, మల్హర్ : పెద్దపల్లి జిల్లా ఖమ్మంపల్లి నుంచి తాడిచెర్ల మీదుగా కిషన్ రావుపల్లి పారెస్ట్ నుంచి భూపాలపల్లి జిల్లా కేంద్రం వరకు డబుల్ రోడ్డుకు రూ.33 కోట్ల 70 లక్షల నిధులు మంజూరైనట్టు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఖమ్మంపల్లి నుండి భూపాలపల్లి వరకు వయా తాడిచర్ల మీదుగా రోడ్డు (భూపాలపల్లి జిల్లాకు తాడిచెర్ల నుండి 42 కిలోమీటర్లు దూరాన్ని ఈ రోడ్డు ద్వారా దాదాపు 18 కిలోమీటర్లు లేదా 20 కిలోమీటర్ల లోపే చేరుకోచ్చన్నారు. కాగా, నిధులు మంజూరు చేసిన మంత్రి శ్రీధర్ బాబుకు మాజీ ఎంపీపీ చింతలపల్లి మలహల్ రావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం క్రాంతి, కాంగ్రెస్ నాయకులు మెరుగు రాజయ్య, బొబ్బిలి రాజు గౌడ్, వెంకటేశ్వర రావు, ఇందారపు ప్రభాకర్, మల్కా మధుసూదన్ రావు, మురళీ రావు పాల్గొన్నారు.

# పర్మిషన్ లేకుంటే సీజ్..

- నిబంధనలు పాటించని దవాఖానలపై కఠిన చర్యలు
- క్యూర్వెల్ ఆసుపత్రిలో బాలింత మృతిపై విచారణకు కమిటీ..
- పలు హాస్పిటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టిన డీఎంహెచ్వో డాక్టర్ సాంబశివరావు



అక్షరదర్బార్, హన్మకొండ : నిబంధనలు పాటించని దవాఖానలపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ డీఎంహెచ్వో డాక్టర్ సాంబశివరావు హెచ్చరించారు. వరంగల్లోని క్యూర్వెల్ దవాఖానలో బాలింత మృతిపై విచారణకు ఎక్స్పర్ట్ కమిటీని నియమిస్తున్నామని, కమిటీ నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదే విధంగా ప్రతిమ క్యాన్సర్ హాస్పిటల్, అపోలో, ఎన్ఎస్ఆర్, వైస్ హాస్పిటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గర్భస్థ పిండ లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్లినిక్లు, పోలీ క్లినిక్లు, హాస్పిటల్స్ నడిపే వారు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలన్నారు. జిల్లాలోని అన్ని క్లినిక్లు, పోలీ క్లినిక్లు, ల్యాబ్లు, హాస్పిటల్స్, వెల్నెస్, ఫిజియోథెరఫీ సెంటర్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అలాగే జిల్లాలోని ఆయుర్వేద, యునాని, హోమియో, సిద్ధ, యోగ, నేచురోపతి వంటి అన్ని హాస్పిటల్స్, క్లినిక్లు కూడా తప్పనిసరిగా ప్రభుత్వం నుంచి అనుమతి పొందాలని, లేకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



# నేను లోకల్..!

- స్థానిక ఇసుక లారీ ఓనర్ల పేరిట జులుం
- సీరియల్ పాటించకుండా బెదిరింపులు
- తిండి తిప్పలు, నిద్ర లేక ఇబ్బందులు పడుతున్న నాన్ లోకల్ డ్రైవర్లు
- పట్టించుకోవాలంటూ వేడుకలు

అక్షరదర్బార్, కాటారం : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో కొందరు ఇసుక లారీ ఓనర్లు రెచ్చిపోతున్నారు. నేను లోకల్ మమ్మల్ని ఎవరేం చేయలేరంటూ భింకం ప్రదర్శిస్తున్నారు. కనీస మానవత్వం మరుస్తూ బెదిరింపులకు గురి చేస్తున్నారు. వీరికి ఇసుక క్వారీల కాంట్రాక్టర్ల తో పాటు టీజీఎండిసి సిబ్బంది సహకరిస్తుండడంతో మరింతగా చెలరేగిపోతున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులను కాస్తా వారి ధనబలంతో మేనేజ్ చేసుకుంటూ బరితెగిస్తున్నారు. దీంతో చేసేదేం లేక సదరు నాన్ లోకల్ లారీ డ్రైవర్లు రెండు, మూడు రోజులుగా తిండి తిప్పలు నిద్రావస్థలు మానేసి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం బహిర్భూమికి వెళ్లే అవకాశం కూడా లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో మా ఇబ్బందులు పట్టించుకోండి సారు అంటూ లారీ డ్రైవర్లు సంబంధిత అధికారులను వేడుకుంటున్నారు.

### - మా రూట్ సెప'రేట్'.!

ఈ మధ్యకాలంలో ఇసుకకు రేటు పెరగడంతో మహదేవపూర్ మండలంలో ఉన్న ఇసుక రీచ్ లకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి వందల సంఖ్యలో ఇసుక లారీలు వస్తున్నాయి. ఈ క్రమంలో ఆయా క్వారీల్లో సుమారు 300 నుంచి 400 వరకు ఇసుక లారీలు వస్తుండగా రెండు నుండీ ఐదు కిలోమీటర్ల మేర ఇసుక లారీలు నిలిచిపోయి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతున్నది. అయితే అందరితోపాటుగా ఇసుక డీడీలు బుక్ చేసుకున్న కొందరు వ్యక్తులు తాము లోకల్ అంటూ మా రూట్ సెపరేట్ అంటూ ట్రాఫిక్ ఏర్పడేలా వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తున్నది. ఒక లారీ వెనుక ఒక లారీ పెట్టుకొని ఇసుక లోడింగ్ కోసం వేచి చూడాల్సింది ఉండగా అందుకు విరుద్ధంగా లోకల్ లారీ ఓనర్లమని చెప్పుకునే కొందరు వ్యక్తులు లారీలను ఓవర్టేక్ చేసుకుంటూ వెళ్ళిపోతుండడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో అటుగా వెళ్లే వ్యవసాయ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతేకాకుండా నాన్ లోకల్ కు సంబంధించిన కొన్ని లారీలను లోకల్ లారీలుగా చెప్పుకుంటూ కొందరు వ్యక్తులు సీరియల్ పేరుతో నూతన దందాకు తెరలేపి ఒక్కో లారీకి రూ.2 వేల నుండీ 5 వేల వరకు దండుకున్నట్లుగా తెలుస్తోంది. ఇదెక్కడి అన్యాయం అంటూ ఎవరైనా నాన్ లోకల్ లారీ డ్రైవర్లు ప్రశ్నిస్తే వారిపై దాడులకు దిగుతున్నట్లుగా సమాచారం.

### - అధికారుల తీరుపై విమర్శలు

నేను లోకల్ అంటూ బెదిరింపులకు దిగుతున్న లోకల్ లారీ ఓనర్లపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత అధికారులు వారికే వత్తాసు పలుకుతున్నట్టుగా సమాచారం. ట్రాఫిక్ రూల్స్ ను కఠిన తరం చేస్తూ ట్రాఫిక్ క్లియరెన్స్ చేసి అందరి పట్ల సమన్యాయం పాటించాల్సింది ఉండగా లోకల్ లారీ ఓనర్ల కే సపోర్ట్ చేస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాన్ లోకల్ లారీ డ్రైవర్లకు కనీస సదుపాయం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలంటూ డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఇటీవల బెదిరింపులకు పాల్పడుతున్న కొందరు లోకల్ లారీ ఓనర్లపై కేసులు నమోదు చేసినట్లుగా సమాచారం.

# సభకు వేళాయే..

- రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు
- 17 లేదా 19న బడ్జెట్..
- సభ ముందుకు బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ బిల్లు



అక్షరదర్బార్, హైదరాబాద్: రేపటి నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసన సభ, మండలిలో ఏర్పాట్లపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి స్పీకర్ సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర శాసనసభ హుందాతనాన్ని పెంచేలా ఏర్పాట్లు ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కాగా ఈ సమావేశాల్లో 2025-26 ఆర్థిక సంవత్సరం బడ్జెట్తో పాటు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. బీసీల 42 శాతం రిజర్వేషన్ల బిల్లులు, ఎస్సీ వర్గీకరణ బిల్లుకు సభ ఆమోదం తీసుకోనున్నారు. ఈ నెల 12న తొలి రోజు ఉభయ సభలను ఉద్దేశించి.. గవర్నర్ ప్రసంగం ఉంటుంది. గవర్నర్ ప్రసంగంపై మరుసటిరోజు ధన్యవాద తీర్మానం ఉంటుంది. 14న హోలీ కావడంతో సభ జరగదు. ఒకవేళ ధన్యవాద తీర్మానం చర్చ కౌన్సిల్లో పూర్తికాకపోతే 15న కూడా దానిపై చర్చించే చాన్స్ ఉంది. 17న ఎస్సీ వర్గీకరణ బిల్లుపై, 18న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులపై అసెంబ్లీలో చర్చించి ఆమోదం తీసుకుంటారని సమాచారం. ఈ నెల 19న రాష్ట్ర బడ్జెట్ను ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తున్నది. ఆ తర్వాత పద్దులపై చర్చించనున్నారు. నెలఖారు వరకు బడ్జెట్ సమావేశాలు కొనసాగించనున్నట్లు సమాచారం. ఒకవేళ రాష్ట్ర బడ్జెట్ను 17న పెడితే.. చివరలో బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ బిల్లులు పెట్టే అవకాశం ఉంటుంది. బీఏసీ సమావేశంలో చర్చించిన తరువాత సభ నిర్వహించే రోజులపై పూర్తి క్లారిటీ రానుంది.

# రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

అక్షర దర్బార్, ఆత్మకూరు: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఆత్మకూరు సిఐ సంతోష్ అన్నారు. మంగళవారం ఆత్మకూరు నుంచి వరంగల్ వెళ్ళే ఆర్ అండ్ బి రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు లేకుండా చేయించి, ప్రమాద సూచిక ( హెచ్చరిక) బోర్డులను ఏర్పాటు చేయించారు. సిఐ సంతోష్ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని, మద్యం తాగి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై, కుటుంబాలను ఆగం చేయవద్దన్నారు. మోటార్ సైకిల్ వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై తిరుపతి, కానిస్టేబుల్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రూప్2 రాష్ట్రస్థాయి రెండో ర్యాంకర్ తేజస్విని రెడ్డికి సన్మానం



అక్షర దర్బార్, శాయంపేట : గ్రూప్-1 ఫలితాల్లో శాయంపేట మండలం మాందారిపేట గ్రామానికి చెందిన జిన్నా తేజస్విని రెడ్డి 532.5 మార్కులతో రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకర్ గా నిలిచింది. ఈ సందర్భంగా తేజస్విని రెడ్డికి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కొమ్ముల భాస్కర్ పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. మా గ్రామానికి చెందిన చదువుల తల్లి, సరస్వతీ పుత్రిక జిన్నా తేజస్విని రెడ్డి కృషి, పట్టుదల నేటి యువతకు ఆదర్శప్రాయమని అన్నారు.



# క్యూర్ వెల్ హాస్పిటల్ లో దారుణం

- వైద్యం వికటించి బాలింత మృతి..!
- డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన

అక్షరదర్బార్, వరంగల్ : వరంగల్‌లోని క్యూర్ వెల్ ప్రైవేట్ హాస్పిటల్‌లో దారుణం చోటుచేసుకుంది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే బాలింత మృతిచెందిందని కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న వరంగల్ ఏసీపీ నందిరాం తన సిబ్బందితో చేరుకుని బాధితులను శాంతిపజేశారు. వివరాల్లోకి వెళ్తే.. బాధితుల కథనం ప్రకారం... జింకల రాజుతో ప్రవళికతో 2019లో వివాహం జరిగింది. 2020లో ప్రవళిక గర్భం దాల్చి బాబుకు జన్మనిచ్చింది. మళ్ళీ ఐదేళ్ల తర్వాత గర్భం దాల్చిన ప్రవల్లికను క్యూర్ వెల్ ఆసుపత్రికి ప్రతినెలా వెళ్తూ పరీక్షలు చేయించుకుంటూరు. ఈ క్రమంలోని సోమవారం ఉదయం శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులు ప్రవల్లికకు పాప పుట్టిందని, తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నారని కుటుంబ సభ్యులకు తెలిపారు. అనంతరం మధ్యాహ్నం రక్తస్రావం అవుతుందని చెప్పారు. అదే సమయంలో గర్భసంచి తొలగించి ప్రవళికకు మెరుగైన వైద్యం అందిస్తామని, అందుకు అబ్జెక్షన్ పత్రాలపై సంతకం తీసుకున్నారు. సాయంత్రం అంతా బాగానే ఉందని వైద్యులు తెలపడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. రాత్రి 9 గంటల సమయంలో ప్రవళిక పరిస్థితి విషమంగా ఉందని, మరో ఆసుపత్రికి తరలించాలంటూ ఆక్సిజన్ సిలిండర్తో మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సీపీఆర్ చేస్తున్న క్రమంలో ప్రవళిక మృతి చెందిందని వైద్యుల కుటుంబ సభ్యులకు తెలిపారు. మొత్తం ఐదు గంటల పాటు ప్రవల్లికకు శస్త్ర చికిత్స, వైద్యం పేరుతో వైద్యులు హంగామా చేసి చనిపోయినట్లు చెప్పారని బాధిత కుటుంబీకులు కన్నీరు మున్నీరుగా వినిపించారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే ప్రవళిక ప్రాణాలు కోల్పోయిందంటూ, అధికారులు చర్యలు తీసుకోవాలంటూ నిరసనకు దిగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది.



# గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్...

అక్షర దర్బార్, కాటారం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజి గ్రౌండ్ సమీపంలో నిషేదిత గంజాయిని సరఫరా చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ పేర్కొన్నారు. కాలేజ్ గ్రౌండ్ సమీపంలో గంజాయి సరఫరా చేస్తూ, తాగుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు మంగళవారం మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ తన సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా ఓ వ్యక్తి నెంబర్ ప్లేట్ లేని బ్లాక్ కలర్ స్ప్లెండర్ ప్లస్ బైక్ మీద డిగ్రీ కాలేజి గ్రౌండ్ కి వస్తుండగా ఆ వ్యక్తిని ఆపి,మోటార్ సైకిల్ ను తనిఖీ చేయగా ట్యాంక్ కవర్ లో గల సంచిలో ఒక నలుపు రంగు కవర్ దొరికింది. దానిని పంచుల సమక్షములో తెరిచి చూడగా ఎండిపోయిన గంజాయి దొరికినది. అట్టి వ్యక్తి మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన షేక్ లుక్మన్(29) గా గుర్తించినట్లు తెలిపారు. అతనికి మహారాష్ట్ర కు చెందిన అహేరి తాలుక ఆళ్లపల్లి గ్రామంలోని మామాజి అను వ్యక్తి వద్ద గంజాయి కనుగోలు చేసి అతను కొంచెం సేవిస్తూ మిగిలినది తెలిసిన వాళ్ళకు అమ్మేవాడని తెలిసింది. అట్టి గంజాయి యొక్క బరువు 625 గ్రాములు గా ఉనట్లుగా ఎస్సై వెల్లడించారు. వెంటనే ఎస్ఐ గారు అట్టి బైక్ తో పాటు గంజాయిను సీజ్ చేసి పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లి విచారణ చేపట్టి కోర్టు ముందు హాజరుపరిచి రిమాండ్ కు తరలించనట్లుగా చెప్పారు.

మంగళవారం
11.03.2025
www.aksharadarbar.com

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

# అన్నను చంపిన తమ్ముడికి జీవిత ఖైదు

- భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు
- 2019లో కాటారం మండలం గంగారం గ్రామంలో ఘటన
- నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసులను అభినందించిన ఎస్పీ

అక్షరదర్బార్, కాటారం: అన్నను హత్యచేసిన తమ్ముడికి కోర్టు జీవిత ఖైదు విధించింది. వివరాల్లోకి వెళ్తే.. కాటారం మండలం గంగారం గ్రామానికి చెందిన మారుపాక అశోక్, నాగరాజు అన్నదమ్ములు. వీరికి వారి స్వగ్రామంలో ఇంటిస్థలం ఉండగా అశోక్ అతడి అన్న మారుపాక నాగరాజు, వీరి తల్లి మారుపాక శంకరమ్మ సమానంగా పంచుకున్నారు. సదురు స్థలంలో తన వాటాకు వచ్చిన స్థలంలో మృతుడు మారుపాక నాగరాజు ఇల్లు నిర్మించుకున్నాడు. నిందితుడు మారుపాక అశోక్ తాగుడుకు అలవాటుపడి తన వాటాకు వచ్చిన భూమిని అమ్ముకొని ఖర్చు చేసుకున్నాడు. అప్పటి నుంచి అశోక్ తన అన్నను అతను కట్టుకున్న ఇంటిలో వాటా వస్తుందని ఇబ్బందులకు గురిచేస్తూ చంపుతానని బెదిరిస్తూ వస్తున్నాడు. దీంతో నాగరాజు గ్రామం నుంచి కుటుంబంతో సహా వెళ్ళిపోయి వేరే గ్రామంలో బతుకుతున్నారు. 2019 మే 10న ఎంపీటీసీ ఎన్నికల్లో ఓటు వేయడానికి నాగరాజు గంగారం రాగా నిందితుడు ఇంటి స్థలం విషయంలో గొడవపడ్డాడు. ఆగ్రహంతో ఖాళీ బీరు బాటిల్ పగులగొట్టి అన్న గొంతులో పొడవగా మృతి చెందాడు. మృతుడి భార్య మారుపాక సరిత ఫిర్యాదు మేరకు అప్పటి కాటారం హెడ్ కానిస్టేబుల్ మహేందర్ నిందితుడిపై హత్య కేసు నమోదు చేశారు. అప్పటి కాటారం సీఐ శివప్రసాద్ నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు. అనంతరం సీఐగా వచ్చిన హతీరామ్ దర్యాప్తు పూర్తి చేసి సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జ్ షీట్ ఫైల్ చేశారు. కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎదులాపురం శ్రీనివాస్ వాదనలు వినిపించారు. కోర్ట్ లైజన్ ఆఫీసర్ ఏఎస్సై గాండ్ల వెంకన్న ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుళ్లు కే. రమేష్, కే వినోద్ సాక్షులను ప్రవేశపెట్టారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో భూపాలపల్లి జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు నిందితుడికి జీవిత ఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కాటారం డీఎస్పీ రాంమోహన్ రెడ్డి, సీఐ నాగార్జున రావు, ఎస్సై అభినవ్ ఎస్పీ కిరణ్ ఖరే అభినందించారు.

# ములుగు గిరిజన వర్సిటీ వీసీగా శ్రీనివాస్

అక్షరదర్బార్, ములుగు: ములుగు జిల్లా కేంద్రంలోని సెంట్రల్ యూనివర్సిటీకి తొలి వీసీగా ప్రొఫెసర్ ఎడవల్లి లక్ష్మీ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ములుగు జిల్లాలో ఉన్న సమ్మక్క సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి మొదటిసారి కేంద్ర విద్యాశాఖ వీసీని నియమించింది. హైదరాబాదులోని అరోరా యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ శ్రీనివాస్ ఐదేళ్లపాటు ములుగు సెంట్రల్ యూనివర్సిటీ వీసీ పదవిలో కొనసాగనున్నారు. యూనివర్సిటీని రూ. 889 కోట్లతో యూనివర్సిటీకి నిర్మాణం తలపెట్టి కొత్త భవనాలను ప్రారంభించారు. త్వరలోనే భవనాలను అందుబాటులోకి తెచ్చి శాశ్వత భవనాల్లో తరగతులు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.




# ఎకరానికి రూ.1 లక్ష

- 24 ఎకరాలకు రూ. 24 లక్షలు డిమాండ్
- అడిగిన మొత్తం ఇవ్వకపోవడంతో హోల్డ్‌లో ఫైల్
- అంతేగాక నకిలీ పత్రాలతో మొత్తం భూమికి ఎసరు
- ముగ్గురి పేర అక్రమ రిజిస్ట్రేషన్‌కు పన్నాగం
- పథకం బెడిసికొట్టడంతో నిలిచిపోయిన ప్రక్రియ
- హన్మకొండ జిల్లాలో ఓ తహసీల్దార్ బరితెగింపు
- ఉన్నతాధికారులకు బాధితుడి ఫిర్యాదు
- రెండున్నర ఏండ్లుగా న్యాయ పోరాటం
- ఆత్మకూరు మండలంలోని ఓ గ్రామంలో ఘటన
- ఈ మొత్తం వ్యవహారంలో అసలు సూత్రధారి ప్రముఖ డాక్టర్
- మరిన్ని వివరాలు రేపటి సంచికలో..

అక్షరదర్బార్, ప్రత్యేక ప్రతినిధి: తండ్రి చనిపోవడంతో ఆయన పేర ఉన్న భూమి హక్కులు బదలాయించాలని దరఖాస్తు పెట్టుకున్న వారసుడికి చుక్కలు చూపించాడు ఓ తహసీల్దార్. 24 ఎకరాల పైచిలుకు వారసత్వ ఆస్తి మార్పిడి కోసం ఎకరానికి రూ. 1 లక్ష చొప్పున మొత్తం 24 లక్షలు డిమాండ్ చేశాడు. పైసలిస్తేనే పని అవుతుందని తేల్చిచెప్పాడు. బిత్తరపోయిన బాధితుడు అంత డబ్బు ఇవ్వలేకపోవడంతో అధికారి కనికరించకుండా ఫైల్‌ని హోల్డ్‌లో పెట్టాడు. అక్కడితో ఆగకుండా దుర్బుద్ధితో తన అధికారం ఉపయోగించి, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి 24 ఎకరాల భూమికి ఎసరు పెట్టాడు. వారసుడికి తెలియకుండానే తన తండ్రి పేర ఉన్న భూమిని ముగ్గురి పేర అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు స్కెచ్ వేశాడు. ఈ విషయం బాధితుడి తెలిసి తహసీల్దార్‌ను నిలదీయడంతో ప్రక్రియ నిలిచిపోయింది. కాగా.. 24 ఎకరాలను అప్పనంగా కొల్లగొట్టే పథకానికి ఓ ప్రముఖ డాక్టర్ వ్యూహరచన చేయగా, తహసీల్దార్ అమలు చేసేందుకు యత్నించి విఫలమయ్యాడు. బాధితుడు అప్పటి వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. అయితే.. ఏండ్లు గడుస్తున్నా ఎలాంటి చర్యలు లేకపోవడంతో ఇంకా కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నాడు.

## కుదరని డీల్..

హన్మకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని ఓ గ్రామంలోని ఓ సర్వే నంబర్‌లో 24 ఎకరాలకుపైగా భూమి ఉంది. 1999లో యజమాని మరణించడంతో అతడి వారసుడు తనకు హక్కు పత్రాలు కల్పించాలని రెండున్నర ఏండ్ల కింత అప్పటి ఆత్మకూరు మండల రెవెన్యూ అధికారికి దరఖాస్తు పెట్టుకున్నాడు. అయితే.. ఫైల్ క్లియర్ చేసేందుకు తహసీల్దార్ ఎకరానికి రూ. 1 లక్ష చొప్పున మొత్తం 24 లక్షలు డిమాండ్ చేశాడు. బిత్తరపోయిన బాధితుడు రూ. 10 లక్షలు రెండు విడతల్లో రూ. 5 లక్షల చొప్పున ఇచ్చేందుకు ఓకే చెప్పగా తహసీల్దార్ సంతృప్తి చెందలేదు. పక్క జిల్లాలోని ఓ పట్టణంలో మధ్యవర్తుల సమక్షంలో జరిగిన ఈ చర్చలు విఫలమవడంతో తహసీ ల్దార్ .. ఆ ఫైల్‌ను మూలనపెట్టాడు.

## అంతటితో ఆగకుండా ..

వారసుడి ఫైల్‌ను పక్కన పెట్టిన తహసీల్దార్ అంతటితో ఆగకుండా 24 ఎకరాలకు ఆనుకుని ఉన్న మరో 25 ఎకరాల భూమి యజమాని (నగరంలోని ఓ ప్రముఖ వైద్యుడు)తో సంప్రదింపులు జరిపాడు. పెద్ద మొత్తంలో డీల్ కుదుర్చుకున్న తర్వాత ఆ పెద్ద మనిషి సూచించిన విధంగా పథకం అమలు చేసేందుకు తహసీల్దార్ ఓకే చెప్పాడు. భూమి యజమాని చనిపోయే ముందు ముగ్గురి పేర 24 ఎకరాలు అమ్మినట్లుగా సంతకాలు పెట్టినట్లు సాదా కాగితాలు సృష్టించారు. ఆ కాగితాలతో ముగ్గురి పేర 24 ఎకరాల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రయత్నించాడు. ముగ్గురిలో ఒకరి పేర 10 ఎకరాలు, మిగిలిన ఇద్దరి పేర చెరో 7 ఎకరాలు కట్టబెట్టేందుకు రెడీ అయ్యాడు. విషయం తెలుసుకున్న బాధితుడు తహసీల్దార్‌ను నిలదీయగా.. మీ నాన్న తాను మరణించే ముందు 24 ఎకరాలను ఆ ముగ్గురికి సాదా పేపర్‌పై రాసిచ్చారని చెప్పడంతో బాధితుడు ఖంగుతిన్నాడు. తనకు జరిగిన అన్యాయంపై పోలీస్ ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేయడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. కాగా, తన తండ్రి సంతకాన్ని ఫోర్జరీ చేసి, తనకు చెందాల్సిన భూమిని కబ్జాదారులకు కట్టబెట్టేందుకు ప్రయత్నించిన అప్పటి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు. మొత్తం ఈ పథకానికి ప్రధాన సూత్రదారి అయిన నగరంలోని ప్రముఖ వైద్యుడి అక్రమాలు రేపటి సంచికలో..

## ములుగు జిల్లాలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన

- దత్తత గ్రామం కొండపర్తిలో అభివృద్ధి పనులు..
- ఘన స్వాగతం పలికిన మంత్రి సీతక్క..


మీడియాతో మాట్లాడుతున్న గవర్నర్

అక్షరదర్బార్, ములుగు : తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ములుగు జిల్లాలో పర్యటించారు. రోడ్ మార్గంలో హైదరాబాద్ నుంచి ములుగు జిల్లా ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ కు చేరుకున్న గవర్నర్ కు రాష్ట్ర మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు. పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం దత్తత గ్రామం తాడ్వాయి మండలం కొండపర్తిలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రభుత్వ గిరిజన పాఠశాల భవనాలకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా మేడారం సమ్మక్క -సారలమ్మను దర్శించుకున్నారు. గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ పర్యటన నేపథ్యంలో గిరిజన జిల్లాలో ములుగులో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు

## ఆత్మకూర్ పీహెచ్సీలో డీఎంహెచ్ఓ తనిఖీ

అక్షర దర్బార్, ఆత్మకూర్ : ఆత్మకూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ ఏ అప్పయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య మహిళా క్లినిక్‌ను పరిశీలించారు. మహిళలకు ఆరోగ్య మహిళా క్లినిక్ లో అందిస్తున్న ఎనిమిది రకాల సేవలను ప్రజలకు వివరించాలని సూచించారు. అసంక్రమిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా 30 ఏళ్ల పైబడిన వారందరినీ రిస్క్రినింగ్ 100% పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ చైతన్య, కమ్యూనిటీ హెల్త్ అధికారి జునేది, సిబ్బంది పాల్గొన్నారు.




Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State. Editor : VEMULA RAJESHWER RAO, email : akshardarbarnews@gmail.com, office No : 7680992278★ RNI NO. TELTEL/2022/81915